# కథావేదిక

**మంచి కథల్ని మళ్ళీ మళ్ళీ చదువుకోవడం కోసం కథలన్నింటినీ ఒకే గుత్తిగా అందిస్తున్నాం.**

## ప్రతిబింబం

**– ఆకెళ్ళ శ్రీరామకృష్ణ**

''ఏమండీ దీక్షితులుగారూ మీ అబ్బాయి డిగ్రీ ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడటగా''

''అవునండీ''

''చాలా బాగుందండీ..మీరు కష్టపడి చదివిస్తున్నందుకు..మీ అబ్బాయి అభివృద్ధిలోకొస్తున్నాడు'' పొగడ్తలతో కూడిన ప్రశంసలు కురిపిస్తున్నాడు ఆయన స్నేహితుడు అవధాన్లు.

''నాదేముందండీ..అంతా ఆ భగవంతుని దయ..'' అంటూ అక్కణ్ణించి బయలుదేరాడు దీక్షితులు.

దారిలో ఒకరిద్దరు కలిసి ఈవిధంగానే ''మీ అబ్బాయి ఫస్టు వచ్చాడట గదా..ఇంకా చదివిస్తారా..ఉద్యోగం చేయిస్తారా..?'' ఇలాంటి ప్రశ్నల పరంపరలకు ఒకింత సంతోషంతో జవాబిస్తూ ఇంటికి చేరుకున్నారు దీక్షితులుగారు.

ఈ ఆనందాన్ని తన అర్ధాంగి మహాలక్ష్మితో కల్సి పంచుకోవాలనుకుంటూ ఇంటికి చేరాడు.

మహాలక్ష్మి ఎదురుగా వచ్చి ''మన అబ్బాయి ఫస్టువచ్చాడండీ..'' అంటూ మురిసిపోతూ చెప్పింది.

ఆ సమయంలో ఆమె ముఖంలో కోటి సూర్యులకాంతి కన్పడింది దీక్షితులుకి ఆక్షణంలో. తన లక్ష్మిని ఇంత అనందంగా చూసి ఎంతకాలం అయింది. మాయదారి జబ్బు మనిషిని పీల్చిపిప్పి చేస్తోందికానీ పెళ్ళయిన కొత్తలో ఎంత అందంగా వుండేది? పేరుకు తగ్గట్టు మహాలక్ష్మిలానే వుండేది. ముగ్గురమ్మాయిల తరువాత వంశోద్ధారకుడు కలిగిన ఆనందం, ఆమెకు వెంటనే వచ్చిన ఈ జబ్బువల్ల మాయమైంది. అది లోలోన మనిషిని పీడిస్తున్నప్పటికీ అది తమ కుమారుని ప్రాపకానికి ఎక్కడా అడ్డురాకుండా చూసుకుంటోంది మహాలక్ష్మి.

• • •


''ఏవండీ మన అబ్బాయి హైదరాబాద్ వెళ్లిపోతానంటున్నాడండీ..మీరైనా చెప్పండి. మన దగ్గరే వుండి చదువుకోమని..నేను వాడ్ని వదిలి వుండలేనండి..'' ప్రాధేయపూర్వకంగా అడిగింది మహాలక్ష్మి.

''మనకు వాడిమీదగల అభిమానం వాడి భవిష్యత్తును నాశనం చేయకూడదు లక్ష్మీ...చక్కగా చదువురావాలని ఆశీర్వదించి పంపు'' అన్నాడు నిర్ద్వంద్వంగా.

భర్తమాటకు ఎదురుచెప్పే అలవాటు తనకెప్పుడూ లేదు. ఇప్పుడు కొత్తగా అలవాటు చేసుకుంటే వచ్చేదీకాదు. తండ్రీ కొడుకు లిద్దరిదీ ఒక్కటే మనస్తత్వం. వాళ్ళకు తోచిందే తప్ప, వేరొకరు చెప్పింది వినిపించుకోరు. తన ఆందోళనను పైకి కన్పడనీయకుండా మనసులోనే దాచుకుని నవ్వుతూ సాగనంపింది.

దీక్షితులు మాత్రం భార్య పరిస్థితిని గమనిస్తూనే వున్నాడు. తనకు మాత్రం బాధగాలేదూ! ముగ్గురు అమ్మాయిలకు పెళ్ళిళ్లు చేసి పంపించేసాడు. ఇక మిగిలింది వీడొక్కడు. వీడైనా తమకు ఆసరాగా వుంటాడనుకుంటే చదువు మిషతో వాడు చేతికి అందీ అందకుండా పోతున్నాడు.

అలాగని తన స్వార్థం కోసం, తన అవసరాల కోసం





## బుద్ధి-తెలివి

''నాకు బుద్ధిలేక మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నాను'' గయ్‌మంది భార్య.

''నాకు తెలివిలేక నిన్ను పెళ్ళి చేసుకున్నాను'' ఇంతెత్తున లేచాడు భర్త.

''మీకు లేనివేంటో అందరికీ తెల్సింది. ఇక పోట్లాట ఆపండి'' పక్కనే వున్న పెద్దాయన అరిచాడు గట్టిగా.

## సొంతబండి

''మాస్కూటర్ మెకానిక్ చాలా మంచి మనిషోయ్. నా బండిని తన స్వంత బండిలా చూసుకుంటాడు'' గొప్పగా మెకానిక్ గురించి చెప్పాడు శ్రీధర్ ఫ్రెండుతో.

''అవును మరి. స్వంత బండిలా ఎందుకు చూసుకోడూ. అది మా నాన్న దగ్గరకన్నా మెకానిక్ దగ్గరే ఎక్కువ రోజులు వుంటుంది'' పక్కనే వున్న కూతురు పద్మ అసలు సంగతి చెప్పింది.

- పి.నాగభూషణం (అమలాపురం)

## టిప్ రుబ్బుడు

''ఇడ్లీ తిని డబ్బులు లేవు అన్నందుకు పిండి రుబ్బించారు బాగానే వుంది కాని చట్నీ కూడా ఎందుకు రుబ్బిస్తున్నట్లు?'' కోపంగా అడిగాడు వంశీ.

''అది మా సర్వర్‌కి టిప్ ఇవ్వనందుకు పనిష్మెంట్'' చెప్పాడు హోటల్ మేనేజర్.

- పి.వి.మురళీకృష్ణ (హైద్రాబాద్)

చూస్తూ చూస్తూ వాడి భవిష్యత్తును నాశనం చేయలేక వూరుకున్నాడు. తనే స్వయంగా వెళ్ళి తనకు తెలిసిన వాళ్ళింట్లో హైదరాబాద్‌లో దింపి వచ్చాడు. ఆపై నెల నెలా ఫీజులకు పుస్తకాలకు డబ్బులు పంపుతూ, తమ బంధువుల ద్వారా తన కుమారుడి యోగక్షేమాలు తెలుసుకుంటూనే వున్నాడు. చూడాలనిపించినప్పుడల్లా ఇద్దరూ వెళ్ళి చూసొస్తుండేవారు.

కాలం గిర్రున తిరిగిపోయింది. అబ్బాయి చదువుకు తగ్గ ఉద్యోగం అక్కడే తన బంధువుల సహాయంతో ఏర్పాటు చేసాడు దీక్షితులు. చదువయిన తర్వాతైనా తమ దగ్గరకు వచ్చి వుంటాడనే ఆశ అత్యాశగానే మిగిలిపోయింది. అప్పుడు చదువు, ఇప్పుడు ఉద్యోగం ఏదైతేనేం తమను వాడినుంచి దూరంగా వుంచింది.

తను కూడా అక్కడి వెళ్ళి వుందామంటే ఈ సరిపల్లె వాతావరణం తనకు బాగా అలవాటైపోయింది. అయినా వాడు రమ్మని పిలిస్తే వెళ్ళక తప్పుతుందా ఆలోచిద్దాం అనుకున్నాడు దీక్షితులు. మహాలక్ష్మి మాత్రం కొడుకు ఎప్పుడు రమ్మంటాడా? అని గంపెడాశతో ఎదురుచూస్తోంది. శంకరశాస్త్రి ఉద్యోగంలో చేరినట్లు ఉత్తరం వచ్చింది. కానీ తమని రమ్మనమని అందులో ఏమీ లేదు.

మొదటి జీతం అందుకున్న తరువాత తమ దగ్గరికి వచ్చి, నాకు కాకపోతే కళ్ళల్లో వత్తులు వేసుకుని ఎదురు చూస్తున్న ఆ తల్లికైనా ఒక చీర పట్టుకొచ్చి, ''మీవల్లే నేనింతవాణ్ని అయ్యానమ్మా'' అని కొడుకు అంటుంటే..అప్పుడు తన లక్ష్మి కళ్ళల్లో కన్పించే ఆనందం చూడాలనుకున్నాడు దీక్షితులు.

కానీ ఎన్ని నెలలు గడిచినా కొడుకు నుంచి తను ఆశించిన జాబు లేదు సరికదా..ఎదురు తనని డబ్బులు పంపమని, జీతం చాలడం లేదని ఉత్తరాలు. తన కొడుకుకు వ్యసనాలు ఏమీ లేవు. మరి ఎందుకు జీతం చాలడం లేదు? ముందు జాగ్రత్తపడుతున్నాడేమో! పర్మినెంటు అయితేగానీ జీతం పెరగదంటూ రాసాడుగా చూద్దాం...అనుకుంటూ తనకు వీలున్నంతలో పంపిస్తూనే వున్నాడు.

• • •

శంకరశాస్త్రికి పిల్లనిస్తామంటూ ఎన్నో సంబంధాలు వస్తున్నాయి. తెలున్నవాళ్ళయితే మరీ ఇబ్బంది పెట్టేస్తున్నారు. ఆడపిల్లగలవారి ఆదుర్దా అలాంటిది మరి. కానీ తను అబ్బాయి అభిప్రాయం తెలుసుకోకుండా మాటివ్వలేకపోతున్నాడు. వాళ్ళ పోరు పడలేక చివరకి అబ్బాయికి వీలుచూసుకుని సెలవుపెట్టుకుని రమ్మని రాశాడు.

దానికి వెంటనే సమాధానం వచ్చింది.

ఉత్తరం చూసిన ఆ దంపతులు అవాక్కైపోయారు.

పెళ్ళి విషయంలో తనకు కొన్ని అభిప్రాయాలున్నాయని, అవి అనుకూలమైతేనే తాను చేసుకుంటానని, ఈ విషయంలో మీరేమీ తొందరపడవద్దని సారాంశం.

ఈరోజుల్లో తల్లిదండ్రులు పిల్లలకు కావాల్సిన సౌకర్యాలు అమర్చడానికి మాత్రమేకానీ, వాళ్ళను శాసించే అధికారం కానీ, ఆశలు, ఆశయాలు తీర్చుకునే అవకాశం గానీ వుండడం లేదు. ''మీ ఇష్టప్రకారమే చేయండి'' అని అంటాడేమోననే భ్రాంతిలో వున్నాడు దీక్షితులు. మనసు చివుక్కుమంది ఎందుకో.

• • •

పెళ్ళి చూపులు మామూలుగా జరిగిపోయాయి.

తల్లిదండ్రులిద్దరూ ప్రేక్షకుల్లా వుండిపోయారు. నల్లురిలో తమ కొడుకుని చిన్నబుచ్చినట్టుంటుందని మహాలక్ష్మి మాత్రం ఒకింత కలుగజేసుకుంది. శంకరశాస్త్రికి అమ్మాయితోపాటు కాబోయే మామగారిచ్చే కట్నం కూడా నచ్చడంతో ముహూర్తం నిర్ణయమైంది.

శంకరశాస్త్రి వివాహంతో దీక్షితులుకు తన పాత్ర ఏమిటో పూర్తిగా అర్థం అయింది. కుమారుని మనస్తత్వం అర్థం చేసుకున్న దీక్షితులు కొడుకేదో చేస్తాడనే ఆశను పూర్తిగా చంపేసుకున్నాడు. అసలా ఆలోచనే మానుకున్నాడు. కానీ మహాలక్ష్మికి మాత్రం ఎక్కడో ఏదో మూల ఆశ మినుకుమినుకుమంటోంది. వాడికి చిన్నతనం, వాడికి తెలిసినా తెలియకపోయినా తల్లిగా తెలియజెప్పాల్సిన బాధ్యత తనకుందనుకుంది. అనుకున్నదే తడవుగా ఒక రోజు కొడుకుతో..

''ఒరే బాబూ శంకరం! నాన్నగార్కి ఆరోగ్యం బాగుండడం లేదు. పనులున్నప్పటికీ ఆయన బయటకు వెళ్ళలేకపోతున్నారు. ఎవర్నో ఒకర్ని బ్రతిమలాడాల్సి వస్తోంది. మందులు తెచ్చిచ్చేవారుండటం లేదు. నా సంగతి సరే సరి. ఇద్దరం నీ దగ్గరికి వచ్చి అక్కడెవరైనా మంచి డాక్టరుకు చూపించుకుంటే బాగుంటుందేమోనని..'' మిగతా మాటలు పూర్తిచేయలేకపోయింది.

''నీ దగ్గరకు వచ్చి వుంటామురా'' అని అడగడానికి అభిమానం అడ్డువచ్చింది. ఆ మాటలకు కొత్తకోడలు వెంటనే.


''అలాగే అత్తయ్యా..ఒక్కదాన్నే వుండాలంటే నాకూ బోర్‌గా వుంటుంది. మీరు కూడా వస్తే నాకు ధైర్యంగా వుంటుంది.'' అంది కోడలు.

ఆ మాటలకు పరమానంద పడిపోయింది ఆ అత్తమ్మ. కానీ అబ్బాయి అంగీకారం కూడా కావాలిగా!

''నీ అభిప్రాయం ఏమిటిరా..'' శంకరశాస్త్రి మౌనం దాల్చేసరికి తనే అడిగింది.

''అలాగే..కానీ..సిటీల్లో డ్వాక్టర్లు టెస్టులనీ, స్కానింగ్ లనీ, అవనీ ఇవనీ..ఫీజులు ఎక్కువ గుంజేస్తారమ్మా..ఇక్కడైతే మన డాక్టరుగారు మనకు చిన్నప్పట్నించి తెలుసున్నవారు...పెద్దగా ఖర్చు అవ్వదు. ఎక్కడైనా మందులొకటే ఆలోచించుకోండి..'' అన్నాడు అక్కడికేదో వాళ్ళ గురించి తను ఎంతో ఆలోచించినట్లుగా.

ప్రాణం చివుక్కుమంది మహాలక్ష్మికి. ఎదిగిన కొడుకు తనకు తానుగా తల్లిదండ్రులను తీసుకెళ్ళాను రమ్మనాల్సింది పోయి, తాను నోరుతెరుచుకుని అడిగినా కూడా...తమకన్నా, తమ ఆరోగ్యం కన్నా డబ్బు లెక్కువయిపోయాయి వాడికి..ఈ విషయం ఆయనకి తెలిస్తే ఎంత బాధపడిపోతారోనని అనుకుంది మహాలక్ష్మి.



ఆ జరిగిన సంభాషణంతా పక్కగదిలో వున్న దీక్షితులు చెవిన పడలేదని, వినలేదని ఆమె భ్రమ. కానీ జరిగినదీ, జరుగుతున్నదీ తెలుసుకోలేనంత అమాయకుడేం కాదు ఆయన.

● ● ●

సంక్రాంతి పండుగ వచ్చింది.

శంకరశాస్త్రికిది పెళ్ళయిన తరువాత వచ్చిన మొదటి పండుగ. శాస్త్రి మామయ్యగారు ఇంట్లోని వారందరినీ పండక్కి రమ్మని పిలిచి వెళ్లేడు. ఆయన పిలిచినదే తడవుగా మహాలక్ష్మి తన ముగ్గురు కూతుళ్ళు, అల్లుళ్ళను పండుగకు రమ్మని ఉత్తరాలు రాయించింది.

తమ్ముడితోపాటు వాళ్ళు కూడా పండుగకు వెళ్ళాలని పైవాళ్ళిద్దరూ వచ్చారు. మూడవ అమ్మాయి రాలేకపోతున్నట్లు ఉత్తరం రాసింది. ఇంక కొడుకు కోడలు రావడమే తరువాయి. మరునాడు వాళ్ళు వస్తున్నారని తెలిసి చిన్న గుండెలో కొండంత సంబరాన్ని నిలుపుకోలేకపోతోంది మహాలక్ష్మి. కొడుకు కోడలు, కూతురు అల్లుళ్ళు అందరితో సరదాగా వెళ్ళాలని మహా ముచ్చట పడిపోతోంది మహాలక్ష్మి.

దీక్షితులుగార్కి ఇటువంటి ఆశలేం లేవు. అయినా ఆమె ఆనందాన్ని తానెందుకు కాదనడం అని స్తబ్దుగా వుండిపోయాడు. కొడుకుకోడలూ రానే వచ్చారు.

ఇంటినిండా ఇంతమంది చుట్టాల్ని చూసేసరికి అవాక్కైపోయాడు శంకరశాస్త్రి. తల్లిని అడిగేసరికి విషయం వివరించింది. దాంతో పెద్ద నిట్టూర్పు విడుస్తూ.

''ఈ మాత్రం దానికి ఇంతమంది వెళితే ఏం బావుంటుందమ్మా? అయినా ఇదేమన్నా పూర్వకాలమా.. ఇంతమందీ కట్టకట్టుకుని వెళ్ళడానికి..''

''అదేమిట్రా అలా అంటావు. అస్తమానూ వెళతామా ఏమిటీ? ఏదో మొదటి పండుగ కాబట్టి అదో సరదా..''

''మన సరదా వేరొకరికి ఇబ్బంది కల్గించకూడదమ్మా..'' అన్నాడు శంకరం.

''ఇబ్బంది ఎవరికిరా నీకా? వాళ్ళకా?'' వుండబట్టలేక ప్రశ్నించాడు దీక్షితులు.

''నాకేముంది..రండి అందరం కట్టకట్టుకుని వెళ్దాం..'' అంటూ తల్లి వైపు తిరిగి.

''నువ్వు అక్కడకు వచ్చి మూలిగితే మాత్రం పనికి రాదు. నీ ఆరోగ్యం బాగుంటేనే రా! అక్కడికి వచ్చి పడిపోతే మాత్రం నీకు చాకిరీలు ఎవరూ చెయ్యలేరు.'' అన్న కొడుకు మాటలు వినేసరికి మహాలక్ష్మి మనస్సు ముక్కలైపోయింది.

ఈ కొడుకు మీదా తను ఇంతకాలం ఇన్ని ఆశలు పెట్టుకుని చేసింది? ఏం మాట్లాడాలో తెలీక శిలాప్రతిమలా నిల్చుండిపోయింది. కానీ దీక్షితులు మాత్రం ఆవేశాన్ని తమాయించుకోలేకపోయాడు.

''ఏమన్నావురా? మూలుగా..ఆ మూలుగుతోనేరా నిన్నింతవాణ్ణి చేసింది. నువ్వేదో పెద్ద చదువులు చదివి దాన్ని సింహాసనం ఎక్కిస్తావని తన ఆరోగ్యం సహితం లెక్క చేయకుండా...నీకు సేవలు చేసిందిరా''

''నాకేం చేసింది..నేను ఎప్పుడు వచ్చినా మంచం మీద పడివుండటమేగా..?''

''అవునా మంచాన్నే పడింది. ఎందుకోసమో తెల్సా...నిన్నింతవాణ్ణి చేయడం కోసమేరా..నీ చిన్నప్పుడు మీ అమ్మకు గుండె బలహీనంగా వుందనీ..పాలివ్వవద్దని డాక్టర్లు హెచ్చరించినా పోతపాలు పట్టడం ఇష్టలేక..తన ప్రాణాలు సహితం లెక్కచేయకుండా నీకు పాలు ఇచ్చి, తన ఆరోగ్యాన్ని, ఆయుష్షుని నీకిచ్చి పెంచిందిరా..కొడుకు ప్రయోజకుడై తనను పట్నం తీసుకెళ్ళి వైద్యం చేయించి తన ఆరోగ్యాన్ని నయం చేస్తాడనుకుందిరా..కానీ స్వార్థానికి ప్రతిరూపమైన నువ్వు..ఒక్కనాడైనా కొడుకుగా అమ్మా ఎలా వున్నావని అడిగావా? ఒక్క రోజు ఆసుపత్రికి తీసుకెళ్ళావా? కొడుకంటే నీలా వుండాలిరా..''

''మీ బాధంతా అమ్మ ఆరోగ్యం బాగోలేదనా? నేను అభివృద్ధిలోకి వచ్చాననా?''

అంటూ ఇంకా ఏదో అనబోయేసరికి మహాలక్ష్మి ఒక్కసారిగా చలించింది. తను ఎంతో గౌరవంగా చూసుకునే తన భర్తను కొడుకు ఎదిరిస్తుంటే తట్టుకోలేకపోయింది.

''నోర్మూయ్. నీ అభివృద్ధి కోసం ఆయనెంత రెక్కలు ముక్కలు చేసుకున్నారో నీకేం తెలుసురా..తన ఆరోగ్యం, తన సంపాదన అంతా నీకే ధారపోసి, వాళ్ళూ వీళ్ళూ పెట్టినవి తప్ప, ఆయనెప్పుడూ ఒక్క పంచెగానీ, ఒక మందుగానీ కొనుక్కోకుండా అంతా నీ చదువుకోసం, నీ అవసరాలు తీర్చడం కోసం ఖర్చుచేసారురా..ముగ్గురాడపిల్లళ్ళ పెళ్లిళ్లు చేసి అలసిపోయినా కూడా ఒక్క మగపిల్లాడివని నెత్తురోడ్చి నిన్నీ స్థితికి తీసుకువస్తే నువ్వీనాడు. ఆయన్ని ఇన్ని మాటలంటావా..'' అంటూ మండిపడింది.


''ఎందుకే అంత ఆవేశపడతావు. తప్పు వాడిది కాదే..మనదే.. మన కులవృత్తిని కాదని, మన శక్తికిమించి ఖర్చు చేసి చదివిస్తే..వాడు పెద్ద ఆఫీసరయి వచ్చి మనల్ని అందలం ఎక్కిస్తాడని ఆశపడ్డామే అదే తప్పు..అవసరం తీరిపోయిన తర్వాత తల్లిదండ్రుల్ని కాలదన్ని వెళ్ళిపోయేవాళ్ళు ఎంతమంది లేరు. చెప్పు..అయినప్పటికీ ప్రతి తల్లీదండ్రీ తమ కొడుకు అలాంటివాడు కాడని పొరబడుతుంటారు. ఆ పిచ్చి ప్రేమే కొడుకుల పాలిట వరం, తల్లిదండ్రుల పాలిట శాపం అవుతోంది..'' అంటూ పక్కగదిలోకెళ్ళి పడక కుర్చీలో కూలబడిపోయాడు దీక్షితులు.

అది దీక్షితులు తండ్రిగారు ఎప్పుడూ కూర్చునే కుర్చీ.. తలెత్తి ఎదురుగా వున్న నిలుటద్దం కేసి చూసేసరికి..తన ప్రతిబింబం తనని వెక్కిరిస్తున్నట్లు అన్పించింది.

గతంలో తను కూడా తన తల్లిదండ్రులను మిగతా అన్నదమ్ములకు వదిలేసి దూరంగా వచ్చి ఇక్కడ స్థిరపడ్డాడు. అప్పుడు వాళ్ళు పడ్డ బాధ తనకు ఇప్పుడు అనుభవ పూర్వకంగా తెలుస్తోంది. చరిత్ర పునరావృతమవుతుంటే తట్టుకోలేక ఆ అద్దాన్ని పగులకొట్టేసాడు దీక్షితులు.

★

## గంగాజలానికి విదేశీ డిమాండ్



గంగాజలం పవిత్రతను, పరిశుభ్రతను విదేశీయులు కూడా గుర్తించారు. (ప్రస్తుతం కోకాకోలా, గోల్డ్‌స్పాట్‌ల మాదిరిగా దీనిని అమృత్‌జల్, నెక్‌టార్ వాటర్ అన్న పేర్లతో సీల్ చేయబడిన సీసాలలో యు.కె.లో గంగాజలం విరివిగా అమ్మబడుతోంది. యు.కె.లోని అన్ని హిందూ దేవాలయాల వద్ద ఈ పవిత్ర గంగాజలం విక్రయించబడుతుంది. నెలల తరబడి నిల్వవున్నా ఏమాత్రం చెడిపోని అద్వితీయ గుణాన్ని, పరిశుద్ధతను విదేశీ పరిశోధకులు పరిశోధన చేసి 'ప్యూరిటీ సర్టిఫికెట్' కూడా ఇచ్చారు గంగాజలానికి!

## తల మీద బొమ్మలు

తలల మీద వింత వింత రంగురంగుల బొమ్మలు, డిజైనులను చిత్రింపజేసుకోవడం ప్యారిస్ నగరంలో పెద్ద ఫ్యాషనైపోయింది. ఫిలిప్ అనే ఒక సెలూన్ యజమాని ఈ తలపై బొమ్మల ఫ్యాషన్‌కు రూపకల్పన చేసాడు. ఇతడు ఇందుకోసం శిరోజాలను వైరైటీగా కట్‌చేసి రకరకాల క్రీములు, లోషన్లతో ఆ వెంట్రుకలను స్టిఫ్‌గా తయారుచేసి వాటిపై పికాసో చిత్రాలను, రకరకాల కళాత్మక దృశ్యాలను, డిజైన్లను, మోడరన్ ఆర్టులను పెయింట్ చేస్తున్నాడతను. ఇలా పెయింట్ చేయడానికి సహకరించిన శిరోజాలను కలిగివున్నవారికి నున్నగా గుండుగీసి ఆ గుండుమీద ఈ కళాత్మక డిజైన్లను చిత్రించి పంపుతుంటాడు. ఈ విధంగా తలపై రంగురంగుల డిజైన్లు వేయించుకోవడం కోసం ఇతని సెలూన్ ముందు ఆడా మగా అనే తేడాలేకుండా బారులు తీరి నిరీక్షిస్తున్నారు ప్యారిస్‌వాసులు!

-శ్రీకొండ

